# నేనొస్తున్నాను...

నది అవతలి ఒడ్డుకి ప్రయాణమౌతూ అద్దంలో చూసుకుంటే నా మొహం నాకే ఎంతో ముద్దొచ్చింది. ఉత్సాహంతో ఉరకలు వేసే వయసు.

సమస్త జీవనకాంక్షలతో ఎగిసిపడే మనసు.

ప్రపంచమంతా నాదేనన్న ధీమాతో వెలుగు దారాలతో రంగురంగుల పూలు కుట్టిన మూడు సంచులని భుజాన వేసుకుని, నా పాట నేస్తాన్ని నా పెదాలపై ఎప్పుడూ ఉండేలా ఒప్పించుకుని, ఈ ఒడ్డున నిలబడి, తూర్పు దిక్కునుంచి పాకి వస్తున్న సూర్యుణ్ణి విప్పారిన కళ్లతో చూస్తూ నిలబడ్డాను.

అప్పుడొక పడవ అటుగా వచ్చింది. నిండైన నదిలో అందంగా కనిపించింది.

నడిపే అతను ముసిముసి నవ్వులతో ముచ్చటగా వున్నాడు...

"వస్తావా..." అన్నాడు.

"ఆ సంచులేమిటీ?" అని ఆరా తీశాడు.

"నా స్నేహాలు, నా అభిరుచులు, నా జ్ఞాపకాలు, నా ఆశయాలు, నా సరదాలు, నా నైపుణ్యాలు... నాకు మాత్రమే సంబంధించిన ఇంకా కొన్ని విశేషాలు."

"ఫరవాలేదు వచ్చేయ్... అవన్నీ నీ వెంట తెచ్చుకో! నీ తోడుగా వచ్చిన ఆ పాటని కూడా నీ పెదాల మీదే వుంచుకో... పడవెక్కడానికి నా చెయ్యి అందించనా."

"ఏం వద్దు. నేనెక్కగలను. ఆ మాటకొస్తే పడవ నడపటం నాకూ వచ్చు. అవునూ... ఎక్కడిదాకా నీ ప్రయాణం" అనడిగాను.

"నా శక్తి మేరకు పడవ నడుపుతూ పోయి ఎక్కడ అలసిపోతే అక్కడ ఆగిపోతా... నువ్వెక్కడ దిగిపోతానంటే అక్కడ దిగు" అన్నాడు.

ఇదేదో బాగున్నట్లే అనిపించి "సరే పద" అన్నాను.

"నా పడవలోకి సుస్వాగతం" అన్నాడు నా కళ్లల్లోకి చూస్తూ. అతని కళ్లల్లో ఆశల దీపాలు కనిపించాయి. పడవెక్కాను.

ఒక్కొక్క చోట ఒక్కొక్క తీరైన నదీప్రవాహం. దూరపు నీలికొండలు. ఒడ్డున పచ్చదనం. పైన నీలాకాశం. నా పెదవులపై నా పాట నేస్తం. ఉషారైన అతని ఈల. అతని మాటలు. వాటిలో అతని ఆశయాలు, అభిప్రాయాలు, కోరికలు, అతని చతుర్లు. అతనిక్కూడా వచ్చిన పాటలు. అలల కలకల. మగత నిద్ర. ఈ ప్రయాణం ఇలా సాగిపోనీ... ఎంతకాలమైనా కానీ అనుకుంటూ పరవశంతో నా సహ ప్రయాణీకుణ్ణి, నా పడవ నడిపే ఆ చిన్నవాణ్ణి నా అంతరంగిక ప్రపంచంలోకి స్వాగతించాను. మనస్సు విప్పాను. గళం విప్పాను. మనశ్శరీరాలసాక్షిగా ఇద్దరం ఆవలి ఒడ్డుకి కలిసే ప్రయాణం చేద్దామని నిండునది ఎదుట పండు వెన్నెల్లో ప్రమాణం చేసుకున్నాం. అంతవరకూ చెరికాసేపూ తెడ్డు వేశామా- ఇప్పుడతను నా వైపు కైపుతో చూసి "నువ్వు కాసేపు విశ్రమించు ప్రియా! బాగా అలసిపోయావు. అలసిన నీ కళ్లల్లో మెరుపు తగ్గేను" అన్నాడు. అతని శ్రద్ధకి ఎంత ఆనందించానో!

నా నేస్తం పాడుతున్న ఒక ప్రణయగీతం వింటూ, ఒక్క క్షణం మత్తుగా కళ్లు మూశానో లేదో అతను అదృశ్యమయ్యాడు.

... నా పాట అతన్ని పిలిచింది.

"వస్తున్నానుండు" అంటూ హడావిడిగా పరిగెత్తుకొచ్చాడు.

"ఎక్కడికెళ్లావ్" అన్నాను కంగారుగా.

"ఇంకా మనం చాలా దూరం పోవాలి కదా. ఇట్లా తెడ్డు వేసుకుంటూ కూర్చోడం విసుగ్గా లేదూ... అందుకని ఈ పడవ దానంతటదే సాగిపోవటానికి ఒక యంత్రం తయారు చేస్తున్నాను."

"యంత్రం పడవ నడిపితే నువ్వేం చేస్తావ్? నా కళ్ళల్లోకి చూస్తూ కూచుంటావా?"

"కాస్త నేల మీదకి దిగిరా తల్లీ. ఇప్పుడంటే వయసులో వున్నాం. ఇలా పడవ నడుపుకుంటూ పోతామా ఎల్లకాలం? మనకీ విశ్రాంతి కావాలి. సుఖవంతమైన జీవితం కావాలి. నువ్విలా ఎప్పుడూ ఎండకీ వానకీ కూచుని తెడ్డు వేస్తూ వుంటావా? అందుకోసం నేనిప్పుడే కాస్త కష్టపడి ఏర్పాట్లు చేస్తున్నాను. మనం తీరం చేరి ఒక చక్కని ఇల్లు కట్టుకుని విశ్రాంతితో కూడిన నాణ్యమైన జీవనం గడపాలి కదా?"

"నాణ్యమైన జీవితమంటే...?"

"తరువాత చెబుతాను గానీ ముందు ఆకలి సంగతి చూడు."

"నువ్వేం తేలేదా తినడానికి..."

"నేనీ యంత్రం తయారుచేసే వరకూ తిండి బాధ్యత నీదే. పడవ కాసేపు ఒడ్డున కట్టేసి తిండి ఏర్పాటు చూడు."

ఆవులిస్తూ లేచి కొంగు నడుముకు బిగించాను.

"నువ్వేదో పనిమీద హడావిడిగా వున్నావ్‌గా, నేను కాసేపు అట్లా చల్లని గాలిలో తిరిగొస్తా..." అని నా పాట నేస్తం వెళ్లిపోయింది.

"నీతో కలిసి పనిచెయ్యడం బాగుంటుంది వెళ్లకు" అని పిలిస్తే "మళ్లీ వస్తాగా" అంటూ వినిపించుకోకుండా నేస్తం వెళ్లిపోయింది.

నా సఖుడికిప్పుడు నా పాట వినే తీరిక లేదు. నన్ను ఆరాధనగా చూసే సమయమూ లేదు. నేను తిండి తయారు చెయ్యడానికి పడవ ఆపినప్పుడల్లా అతను చెట్లల్లో, పుట్టల్లో తిరిగి ఏదేదో తెచ్చి పడవ నింపేస్తున్నాడు. వాటన్నింటినీ పొందికగా సర్దమంటున్నాడు. పోగెయ్యడమే పనిగా పెట్టుకున్నాడు. అతని ఈ కార్యదీక్ష నన్నూ అబ్బురపరుస్తోంది. ఈ మనిషి సమర్థుడు. శక్తిమంతుడు. ప్రేమాస్పదుడు... అని అతన్ని మరింత ఆరాధించడం మొదలు పెట్టాను. అతని కోసం మరింత శ్రద్ధగా వండడం, అతనికి విశ్రాంతి కల్పించడం కోసం పని పంచుకోడం అలవాటు చేసుకున్నాను. ఎటూ పడవ నడిపే యంత్రం తయారవుతోంది కదా. ఈ కొన్నాళ్లూ నేనే తెడ్డు వేసి అతనికి మరింత సమయం కల్పిద్దామనుకున్నాను. ఇదంతా ఇష్టంతో, సంతోషంతో చేస్తున్నాను. పడవ రకరకాల వస్తువులతో నిండుతోంది. మేము ఆవల తీరానికి చేరి ఒక చక్కని ఇల్లు నిర్మించుకుని నాణ్యమైన సమయం గడపడానికి అవసరమైన ఇటుకలు, ఇంకా అనేక వస్తువులతో పడవ నిండిపోతోంది... ఎప్పుడూ ఏదో ఒక శబ్దం. సుత్తులతో కొడుతూ, రంపాలతో కోస్తూ, సమ్మెట వేస్తూ... ఒకరోజు ఉలిక్కిపడి "అయ్యో నా పాట ఏమైంది... నా చిరకాల నేస్తం అప్పుడనగా వెళ్లి ఇదిగో వస్తానని మళ్లీ రాలేదేం" అనుకుని గొంతెత్తి గట్టిగా పిలిచాను. పిలవగా పిలవగా వచ్చింది. నా మీద అదివరకు చూపించే ఇష్టం తన గొంతులో దొరకలేదు నాకు.

"ఏమిటమ్మా అదే పోక పోయావు? పిలిస్తే గానీ వచ్చావు కాదు" అన్నాను నిష్ఠూరంగా...

"నీ ప్రియుడు చేస్తున్న శబ్దాలు విని భరించే ఓపిక లేదు. కొత్తలో ఆ శబ్దాలలో ఒక లయ ఉండేది. వాటితో పాటు నేనూ పాడేదాన్ని. ఇప్పుడది రణగొణ ధ్వనిలా మారిపోయింది... ఎప్పుడూ యంత్రాల మోతే అయితే నా వల్ల కాదు... నే వెళ్లొస్తా. ఇప్పుడు కావాలంటే నీ కోసం కాసేపుంటా. పద అట్లా చెట్ల మధ్య కెళ్లి కాసేపు తిరిగొద్దాం" అంది.

"అప్పుడప్పుడూ ఇట్లాగే వచ్చి నీకు సాంత్వన కలిగిస్తా గానీ అచ్చంగా నీ పెదాల మీద మాత్రం, ఈ హోరులో నేనుండలేను" అనేసి వెళ్లిపోయింది.

నన్ను పడవలోకి వెలుగు కళ్లతో ఆహ్వానించినవాడు, నన్ను చెయ్యిపట్టి పడవలోకి ఎక్కిస్తానన్నవాడు, ముసి ముసి నవ్వులతో ముచ్చటగా వున్నవాడు, నాకు తిండివేళ తప్ప కనిపించటమే లేదు. ఆ నవ్వులూ లేవు, ఆ ముచ్చట్లూ లేవు... ఏవేవో తెచ్చి పడవ నింపడం, తయారు చెయ్యడంలో నిమగ్నమై పోయాడు. ఆ మధ్యనొక రోజు ఒక కొత్తదేదో తయారుచేస్తూ కనిపించాడు. అదేమిటని అడిగితే అది ఒక ఆయుధమని చెప్పాడు. మమ్మల్ని మేము రక్షించుకోటానికట.

ఇక అతనితో కాదని – నా పూర్వ స్నేహాలు, జ్ఞాపకాల సరదాలతో, నా జీవితాన్ని కొనసాగిద్దామని నేను తెచ్చుకున్న వెలుగుపూల సంచులు విప్పుకుందామనుకుంటూ వాటికోసం వెతికాను. పడవంతా కలయ తిరిగాను.

ఒక్క సంచీ కనపడలేదు. ఇటుకల కింద, మేకుల డబ్బాల కింద, సుత్తుల కింద, శాణాల కింద వాటికింద, వీటికింద ఎక్కడ వెతికినా కనపడలేదు.

"అయ్యో!! ఏవీ నా స్నేహాలు, నా జ్ఞాపకాలు, నా అనుభవాలు, నా నైపుణ్యాలు? ఎక్కడ... ఎక్కడ" అని ఆక్రోశించాను. అతనిపై మోహంతో, ప్రేమతో నన్ను నేను మర్చిపోయానా? నా సంపదనంతా పోగొట్టుకున్నానా?

"మనం సేకరించిన ఈ సంపదనంతా పడవలో నింపే క్రమంలో అవి అడ్డం వచ్చి వుంటాయి. నదిలో గిరాటేసి ఉంటాం" అన్నాడు నా సఖుడు చాలా తేలికగా... అలా అనేసి నా చెయ్యి పట్టుకుని పడవలో తన కార్ఖానాకి తీసుకుపోయి "ఇన్నాళ్ళ నా శ్రమ ఫలించింది చూడు. ఇక నీకు పడవ నడిపే పనే లేదు... హాయిగా విశ్రాంతి తీసుకో... పాపం చాలా కష్టపడ్డావు. చెంపల దగ్గర వెంట్రుకలు తెల్లబడ్డాయి నేను గమనించలేదు చూశావా? నీ రంగు కూడా తగ్గింది. ఇక పడవ తనంతట తనే వెడుతుంది. నువ్వు నీ గురించి శ్రద్ధ తీసుకో... నాకు ఇంకాస్త పనుంది. నేను కనిపెట్టాల్సినవీ, సంపాదించవలసినవీ కొన్ని మిగిలిపోయాయి. నిజానికి సంపాదించింది చాల్లే, ఇక వీటితో మనం మంచి ఇల్లు కట్టుకుని హాయిగా ఉండొచ్చు అనుకుంటామా ఏదో ఒకటి మళ్లీ మిగిలి ఉంటుంది... ఇదిగో నీ చేతుల్తో ఈ మీట నొక్కు... ఆ తెడ్డు విసిరి నదిలో పడేయ్. ఇదొక్కటే కాదు, ఇంకా చాలా పనులు వాటంతటవే జరిగిపోయేలాగా చేసే యంత్రాలు తయారు చేస్తున్నాను. నీ పనల్లా అలా వేళ్లతో అలవోకగా మీటలు నొక్కటమే. ఇలా కాయకష్టంతో పనుండదు... సరే ముందీ మీట నొక్కు" అన్నాడు.

మీట నొక్కాను. పడవ వేగం పుంజుకుంది. నేను కూచున్నాను. నా పాట పోయింది. నా వెలుగుపూల సంచులు పోయాయి. నా సఖుడు ఎప్పుడు కనపడతాడో తెలీదు. ఇప్పుడు నాకు పడవనడిపే పని కూడా పోయింది.

"నేనేం చెయ్యాలిప్పుడు? నా నైపుణ్యాలు పోయాయి. నేనూ నీతో నీ కార్ఖానాలో పనిచేస్తాను" అన్నాను.

"ఒద్దొద్దు... నువ్వు విశ్రాంతి తీసుకో... చెదిరిపోతున్న నీ సౌందర్యం కాపాడుకో. నాకు తిండి పెట్టు. నా అవసరాలు చూడు" అన్నాడు.

నీళ్లల్లో నా ముఖం చూసుకున్నాను. పాటలేని పెదవులు ఎండిపోయాయి... పడవెక్కినప్పుడు నాకే ముద్దొచ్చిన నా మొహం ఇప్పుడు అరిగిపోయినట్లుంది. పడవ రయ్ మని నీళ్లని కోసుకుంటూ పరుగులు పెడుతోంది. రాను రాను బరువు కూడా పెరుగుతోంది.

పడవలో మా బంగారు భవిష్యత్తు కోసం, రాజాలాంటి బ్రతుకు కోసం అతనేమేమి నింపుతున్నాడో తెలీదు. అసలు నాకు చిన్నప్పటి నుంచీ ఈ రెండు పదాలూ ఇష్టం ఉండేది కాదు. రాజాలాగా బ్రతకటం అంటే పనిచెయ్యకుండా పదిమందితో కలవకుండా ఆధిక్యతతో వుండాలని కదా. అంటే రాజా ఒక్కడేనా మన నమూనా? అనిపించేది. 'బంగారంలాంటి' అనే మాట కూడా నాకిష్టం అనిపించేది కాదు. బంగారానికి పరిమళం, రుచీ లేదు. ఖరీదైన వస్తువులేనా మనం కోరుకోవలసినవి అనిపించేది. ఇప్పుడు నా ప్రియసఖుడు కూడా తరచు ఈ రెండు పదాలే వాడుతూ నాకు విసుగు కలిగిస్తున్నాడు.

పడవ బరువు పెరుగుతోంది. శబ్దాల హోరు ఎక్కువైంది. పాటమ్మ ఏమైందో అయిపు లేకుండా పోయింది. సఖుని దర్శనం అపురూపమైంది. అసలు నేనెక్కడికి బయల్దేరాను? ఏ ఉద్దేశ్యంతో బయలుదేరాను? ఏ గమ్యం కోరుకున్నాను? ఇతను పిలిచీ పిలవగానే సమ్మోహితురాలినై ఈ పడవలో ఎందుకు ప్రవేశించాను... అతనితో పంచుకున్న అనుభవాలు, చెప్పుకున్న ఊసులు, అన్నీ ఒక్కొక్కటే అదృశ్యమైపోయాయి. అవునూ అతగాడు... నన్ను తన సమ్మోహనాస్త్రంతో కట్టి పడేసినవాడు, తన నవ్వులతో నన్ను ఆకట్టుకున్నవాడు... నా పాటల్ని, నా స్నేహాల్ని పదిలంగా ఉంచుకోమని చెప్తూనే తన వస్తువుల కడ్డొచ్చాయని వాటిని నదిలోకి గిరాటు పెట్టినవాడు, నాకొక అద్భుత ప్రపంచం సృష్టిస్తానన్నవాడు, నేను నా ఆత్మనీ, నా శరీరాన్నీ అర్పించుకున్నవాడు ఏడి?

ఎక్కడనుంచో సన్నగా మూలుగు వినపడుతోంది. ఈ పడవలో నేనూ, అతనూ తప్ప మరొకరెవరూ లేరే! ఎవరిదా ఆక్రందన?

ఉలిక్కిపడి లేచాను. పడవ పరిగెడుతూనే ఉంది. తన బరువు తగ్గించమని పడవ అడిగినప్పుడల్లా కొత్తగా సంపాదించిన వస్తువులు, కనిపెట్టాల్సిన యంత్రాల తాలూకు సామాన్లు మాత్రం వుంచి, పాత జ్ఞాపకాలు, అలవాట్లు ఒక్కొక్కటే గిరాటు పెట్టేస్తున్నాం. ఇప్పుడిక పాతవేం లేవు. అన్నీ కొత్తవీ, పనికొచ్చేవే...

ఎవరో గట్టిగా నవ్వారు. ఎవరబ్బావాళ్లు? అతనూ, నేనూ, యంత్రాలు తప్ప ఎవరూ లేరే ఇక్కడ... మరి నవ్విందెవరు? మూలిగిందెవరు?

"అవును కదా!! మరి నవ్వింది నేనే!! మూలిగేది ఎవరో తెలిసిపోలేదా?" అంది పడవ నడుపుతున్న యంత్రం.

"ఇప్పుడు బరువైంది నువ్వే!! అందుకే నువ్వే దూకెయ్... నా మానాన నేను పోతాను" అంది కాసేపాగి.

"ముందు అతన్ని పిలు దూకితే ఇద్దరం కలిసే దూకుతాం. లేదా ఈ వస్తువులన్నీ గిరాటేసి మేమే హాయిగా తెడ్డు వేసుకుంటూ పోతాం. ముందు నీ పీక నొక్కేస్తాం."

"అదుగో చూడు అతను తను తయారుచేసిన వస్తువుల మధ్య ఇరుక్కుపోయాడు. బయటకు రాలేక సతమతమైపోతున్నాడు. ఇక అతను వాటి మధ్య నించే కాదు, ఇంకా తయారుచెయ్యాలనే ఆశలోంచి కూడా బయటికి రాలేదు. అతనలా గింజుకుని గింజుకుని పోవాల్సిందే."

"అట్లా వీల్లేదు, ఇదిగో వస్తున్నా వుండు, నేనతన్ని బయటికి లాగుతాను. ఇన్నాళ్లూ నేనొక భ్రాంతిలో ఉండిపోయాను. అతను మొదటినించీ నన్నేదో విధంగా సమ్మోహన పరుస్తూనే ఉన్నాడు. నన్ను నా సౌందర్యం కాపాడుకోమన్నాడు. అతనంటే మాత్రం నేను గంగిరెద్దులా తల ఊపడమేనా? నా బాధ్యత మర్చిపోడమేనా? అతన్ని ఈ తయారీ దాహం నుంచి తప్పించే బాధ్యత నేనెందుకు తీసుకోలేదు? అతనికి ముందు నుంచి నా భావాలు, నా ఆశయాల గురించి నేనెందుకు అర్థం చేయించలేదు? నా సంచులు నేనెందుకు పోగొట్టుకున్నాను? ఎంత అలసత్వం ప్రదర్శించాను? నాకు నావన్నీ కావాలి. నా ప్రియ సఖుడూ కావాలి."

"అతన్ని బయట పడెయ్యటం ఇప్పుడు నీ వల్ల కాదు. చిన్నప్పటినించీ నీ వెంట వున్న నీ పాట నేస్తాన్ని కూడా పోగొట్టుకున్నావ్... ఇక ఎవరి సాయంతో అతన్ని బయటికి తీస్తావ్? అయినా నేను ఒక పరిమితమైన బరువు వరకే పడవని తేలిగ్గా పోనివ్వగలను. ఇప్పుడు నువ్వే నాకు బరువు. దిగి ఈదుకుంటూపోతావో మునిగిపోతావో నీ ఇష్టం... త్వరగా కానీ!! లేకపోతే నాతో సహా మొత్తం మునిగిపోతుంది" అంది పడవ నడిపే యంత్రం.

నవ్వొచ్చింది... నేనూ, అతనూ లేకపోయాక ఇక పడవ మునిగితే నాకేంటీ?, నడిస్తే నాకేంటీ? అయినా అసలు పడవని యెందుకు మునగనివ్వాలి?

నేను నా గొంతునంతా ఉపయోగించి గట్టిగా నా పాట నేస్తాన్ని పిలిచాను. ఒక పొలికేక పెట్టాను...

తనకి ఎంత దయో నా మీద... వచ్చి నా పెదవుల మీద వాలింది. నా గుండెని శృతి చేసింది.

ఇద్దరం కలిసి బయలుదేరాం. యంత్రాల మధ్యకి, అంతులేని వస్తువుల మధ్యకి... అతణ్ణి శోధించటానికి... అతన్ని కాపాడుకోడానికి. అతని విలువైన ముఖ్యమైన పరిశోధనలతో సహా అతణ్ణి రక్షించుకోటానికి!!

నన్ను తన పడవలోకి స్వాగతించిన వాణ్ణి తిరిగి తెచ్చుకోడానికి... నా వెలుగుపూల సంచుల్ని మళ్లీ తయారుచేసుకోటానికి.

పడవలో అవసరానికి మించిన ఆర్భాటాలన్నీ గిరాటేసి మళ్లీ సంతృప్తికరమైన ఒక సుందర జీవితానికి నాంది పలకడానికి.

అక్కర్లేని వస్తువులు తయారు-చెయ్యకుండా జీవితంలో కొంచెం విశ్రాంతి, కొంచెం భావుకత, ఎంతో ప్రేమా, ఇతరుల గురించిన ఆలోచన ఉండేలా చూసుకోడానికి. వెలుగుపూల సంచులని విలువలతో నింపుకోడానికి...

నాకూ, నా పాటకీ ఆ శక్తి సామర్థ్యాలున్నాయని మాకిద్దరికీ ఎనలేని నమ్మకం.

నా సఖునిలాగే, అనేకానేక వ్యామోహాల్లో అత్యాశల మాయ జలతారు వలల్లో చిక్కుకుపోయిన తమ ప్రేయసుల కోసం చింతపడే ప్రియులు కూడా నాతో గొంతు కలిపితే మనం మన ప్రపంచాన్ని మరింత జీవనయోగ్యంగా మలుచుకోవచ్చు కదా. *

*(ఆదివారం 'ఆంధ్రజ్యోతి' నవంబర్ 2007, కథావార్షిక, 2007)*